## ప్రసంగము 1

# అసాధారణ ప్రేమ కథ

## (హోషేయ 1-3)

ప్రతి ఒక్కరూ ఒక మంచి ప్రేమ కథతో కదిలించబడతారు. అటువంటి కథలు లోకంలోని ప్రతి సంస్కృతిలోనూ కనబడుతుంది.

బైబిల్లోనూ ఎన్నో ఆసక్తికర ప్రేమ కథలున్నాయి. అన్నిటిలోనూ ఆశ్చర్యమైన ప్రేమకథ హోషేయ గ్రంథంలో కనబడుతుంది. ఆ ప్రేమ కథను మనం చదువుతుంటే, అది హోషేయ కాలంలో పాఠంగా ఎలా అన్వయించబడిందో. అది ఈనాడు ఎలా అన్వయించబడాలో చూస్తాము.

### అనుభవించబడిన ప్రేమ కథ

"జనులు యెహోవాను విసర్జించి బహుగా వ్యభిచరించియున్నారు గనుక నీవు పోయి వ్యభిచారము చేయు స్త్రీని పెండ్లాడు" అని హోషేయ 1:2లో దేవుడు హోషేయకు ఆజ్ఞాపించినట్లు చూస్తున్నాము. అలా హోషేయ గోమెరును వివాహమాడాడు (1:3). తరువాత గోమెరు ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది: ఒక కుమారుడు యెజ్రెయేలు (రక్తం చిందింపబడిన లోయ), ఒక కుమార్తె లోరూహామా ("జాలినొందనిది") మరియు మరో కుమారుడు లోఅమ్మి ("నా జనము కాదు") (1:4-9).

ఈ ప్రేమ కథ 3వ అధ్యాయంలోనూ కొనసాగుతుంది. ఇక్కడ, "దాని ప్రియునికి ఇష్టురాలై వ్యభిచారిణియగు దాని యొద్దకు నీవు పోయి దానిని ప్రేమించుము" అని హోషేయ సెలవియ్యబడ్డాడు (3:1). అప్పుడు ప్రవక్త వేశ్యను "పదునైదు తులముల వెండియు ఏదుము యవలను" (3:2) ఇచ్చి ఆమెను తీసుకొచ్చాడు. ఆమె హోషేయతో "చాలదినములు" నమ్మకంగా యుండాలని కోరాడు (3:3).

ఈ అసాధారణమైన ప్రేమ కథలో ఏం జరిగింది? ఒక వేశ్యను వివాహమాడాలని దేవుడు హోషేయను కోరినట్లు కనబడుతుంది. ఈ ఆలోచన అనేకమంది వ్యాఖ్యానకర్తలకు మింగుడు పడనిదిగా - స్వచిత్తం ప్రకారమే - హోషేయను ఒక వేశ్యను వివాహమాడేందుకు సూచించాడు.

తరువాత హోషేయ భార్య వ్యభిచరించినా హోషేయ ఆమెను ప్రేమించాడు. తరువాత 3:1 ప్రకారము, "వ్యభిచారిణియగు ఆమెను ప్రేమించుమని" దేవుడు హోషేయకు సూచించాడు. వేశ్యను వివాహమాడాలన్న మొదటి సూచనే ఎంతో కష్టంగా ఉంటే ఇక రెండవది ఎంత కష్టంగా ఉంటుంది! అయినా హోషేయ పాటించాడు, గోమెరు అప్పటికే మరొకరి సొంతం అయి ఉంటుంది. ఆమెను వెనక్కు తేచ్చేందుకు హోషేయ వెలచెల్లించాడు, అతడు పదునైదు తులముల వెండి ఇంకను కొంత ఆహారాన్ని ఇచ్చాడు. అప్పుడామెను తన ఇంటికి తీసుకు వచ్చి తనతో నమ్మకంగా ఉండమని చెప్పాడు.

ఎంత కఠినమైన ప్రేమ కథ! అన్ని ప్రేమ కథల్లోనూ అందమైన హిరోయిన్, అంతకంటే

ధైర్యవంతుడైన హీరో ఉంటారు, ఇద్దరూ మొదటి చూపులోనే ప్రేమలో పడతారు. ఇద్దరికీ శరీరక సౌందర్యం, అంతరంగ శక్తి వచ్చుతాయి. సాధారణంగా ఏదో సమస్య కొంతకాలం పాటు ఇద్దర్నీ విడదీసినా, దాన్నీ జయించి, పెళ్లి చేసుకుని, ఎల్లకాలం సంతోషంగా ఉంటారు. దీనికి, దానికి ఎంతతేడా ఉందో చూశారా! హోషేయ గోమెరును మొదటిసారి చూసినప్పుడే ప్రేమలో పడ్డాడా? లేదు, దేవుడు అలా చేయమన్నందుకు అతడలా చేశాడు, వారి వివాహం తర్వాత వారు "ఎల్లకాలం సంతోషంగా జీవించారా"? లేదు. ఆమె వ్యభిచారం చేసి తన కుటుంబాన్ని విడచి పెట్టింది, తర్వాత ఏం జరిగింది? కథలో అసలు మలుపు ఏంటంటే హోషేయ ఆమెను తిరిగి చేర్చుకోవడం. నిజానికి హోషేయ అంతకంటే ఎక్కువే చేశాడు. ఆమెను తిరిగి తెచ్చుకునేందుకు తన కోసం వెదికి వెల ఇచ్చి ఆమెను తెచ్చుకున్నాడు. ఇదే కథను నిజమైన ప్రేమకథగా చేసింది!

## అప్పటికి అన్వయించబడిన ప్రేమ కథ

ఈ కథ ఎందుకు చెప్పబడింది? ఇది ఎందుకు జరిగింది? వాక్యంలో ఇది ఎందుకు చేర్చబడింది? ఈ సంగతులు చోటుచేసుకునేందుకు దేవుడు ఎలా అనుమతించాడు?

ఈ ప్రశ్నలకు సమాధానం, "పాఠం నేర్పించేందుకే!" దేవుడు తన ప్రవక్తలను ఎన్నుకుని వారి ద్వారా దాన్ని చూస్తున్న, వింటున్న వారికి పాఠం నేర్పిస్తుంటాడు, దేవుని సందేశాన్ని చెప్పేందుకు ప్రవక్తల జీవితాలు "దృశ్య రూపకాలు"గా ఉంటాయి.

### హోషేయ 1 మరియు 3లో సందేశం

హోషేయ అనుభవ విషయంలో 1 మరియు 3వ అధ్యాయాలను బట్టి హోషేయకు దేవుడు దాన్ని ఉద్దేశించాడు అని వాక్యం చెప్తుంది. కాబట్టి హోషేయ అనుభవం, ఇశ్రాయేలుతో దేవుని సంబంధానికి సాదృశ్యంగా ఉందని అర్థం అవుతుంది. దేవుడు మొదట హోషేయను పిలిచినప్పుడు, "వ్యభిచారం చేయు స్త్రీనీ వివాహమాడమని" దేవుడు హోషేయకు చేప్పాడు. ఎందుకంటే, "జనులు యెహోవాను విసర్జించి బహుగా వ్యభిచరించియున్నారు" (1:2). హోషేయ యొక్క ముగ్గురు పిల్లలపేర్లు దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చే సందేశాన్ని సూచిస్తున్నాయి: "యెజ్రెయేలు" అన్నపేరు దేవుడు ఇశ్రాయేలును శిక్షించునని చెప్తుంది (1:4); "లోరూహామా" అన్న పేరు దేవుడు ఇకమీదట ఇశ్రాయేలు మీద జాలి చూపడని (1:6, 7); "లోఅమ్మీ" అన్నపేరు దేవుడు ఇశ్రాయేలను తన జనముగా లెక్కించడని చెప్తుంది (1:9). తరువాత 3వ అధ్యాయములో, "ఇశ్రాయేలీయులు ద్రాక్షపండ్ల అడలను కోరి యితర దేవతలను పూజించినను యెహోవా వారిని ప్రేమించినట్లు, దాని ప్రియునికి ఇష్టురాలై వ్యభిచారిణియగు దాని యొద్దకు నీవు పోయి దానిని ప్రేమించుము" (3:1) అని దేవుడు హోషేయతో అన్నట్లు కనుబడుతుంది. గోమెరుతో హోషేయ యొక్క సంబంధం ఇశ్రాయేలుతో దేవుని యొక్క సంబంధమునకు సాదృశ్యంగా ఉందని అర్థమవుతుంది.

హోషేయ వివాహబంధం నుండి ఇశ్రాయేలు ఏ పాఠం నేర్చుకోవాలి? మొదటిగా, ఇశ్రాయేలు యొక్క నీతిని చూచి దేవుడు తనతో నుండేందుకు దేశాన్ని పిలువలేదని ఇశ్రాయేలు నేర్చుకోవాలి. రెండవదిగా, ఇశ్రాయేలు ప్రజలు అన్యదేవతలను ఆశ్రయించడం ద్వారా ఆత్మీయ వ్యభిచారం చేశారు. మూడవదిగా, దేవుడింకను ఇశ్రాయేలును ప్రేమిస్తున్నాడని,

ఆయన ప్రజలు ఆయన యొద్దకు తిరిగి రావాలని ఆయన కోరుకుంటున్నాడని హోషేయ అనుభవం చెప్తుంది.

**హోషేయ 2 యొక్క సందేశం**

చివరి విషయం – అనగా ఇశ్రాయేలు తిరిగి దేవుని యొద్దకు రావాలని ఆయన కోరుకుంటున్నాడన్న విషయం 2వ అధ్యాయంలోనూ చర్చించబడింది. ఇశ్రాయేలును తిరిగి తెచ్చుకునేందుకు దేవుడు ఏం చేయనున్నాడన్న విషయాన్ని పద్యరూపంలో ఇక్కడ చర్చించబడింది. 3వ అధ్యాయంలో హోషేయ చెప్పిన విషయాన్ని పద్య అలంకార రూపంలో 2వ అధ్యాయంలో చెప్పబడిందని మనం చెప్పవచ్చు.

ఈ అధ్యాయంలో దేవుడు చేసిన మొదటి పని, ఇశ్రాయేలు యొక్క వ్యభిచారాన్ని ఖండించడం (చూడండి 2:1, 2) తరువాత ఇశ్రాయేలు పశ్చాత్తాపం పొందేందుకు దేవుడు ఏం చేయనున్నాడో వాటి వివరాలను ఇస్తున్నాడు.

*మొదటగా, ఆమె గమనాన్ని తిప్పేందుకు ఆమెను శిక్షించనున్నాడు* – ఆమె పాపాన్ని గుర్తించేందుకు, దాన్ని ఫలితాన్ని ఎరిగియుండేందుకు ఇలా చేయనున్నాడు. ఆయన (1) “ఆమెను దిగంబరురాలినిగా” చేయనున్నాడు (2:3ఎ); (2) “పాడు పట్టి ఎండిపోయిన భూమి వలెను ఉంచి, దప్పిచేత లయపరచడం” (2:3బి); (3) “దాని పిల్లలు జార సంతతియైయున్నారు, వారి తల్లి వేశ్యత్వము చేసియున్నది గనుక వారియందు జాలిపడను” (2:4); (4) కంచె అడ్డు వేసి, దాని “విటకాండ్రను” అందకుండ చేయుదును, అంటే విగ్రహాలను అందకుండ చేయుదును (2:6, 7); (5) “కరువు ద్వారా ధాన్యము, ఆహారము లేకుండా చేయడం” (2:9); (6) “దాని విటకాండ్రు చూచుచుండగా దాని పోకిరీతనమును బయలుపరచడం” (2:10); (7) ఉత్సవ దినములు చేయకుండా అడ్డగించడం (2:11); (8) “దాని ద్రాక్ష, అంజూరపు చెట్లను నాశనం చేయడం” (2:12); మరియు (9) “దానిని శిక్షింతును” (2:13).

*రెండవదిగా, తనను వివాహమాడమని దేవుడు ఇశ్రాయేలును కోరుతున్నాడు.* ఆమె తనను తానుగా తన యొద్దకు వచ్చేందుకు దేవుడామెను లాలిస్తున్నాడు, ఆమెపట్ల దేవుని ప్రేమ ఆమె ప్రేమగా ప్రతిస్పందించేందుకు కారణమయ్యింది, “నేను దానితో ప్రేమగా మాట్లాడుదును” (2:14) అని ఆయన అంటున్నాడు. ఆమె తన యవ్వనంలో మాట వినినట్లు ఇప్పుడు దేవుడామెకు ద్రాక్షచెట్లనిస్తున్నాడు (2:15). అప్పుడు అది ఇక దేవున్ని బయలు (యజమానుడు) అని పిలువక నా పురుషుడవు (భర్త) అని పిలుస్తుంది (2:16). అన్యదేవతలైన బయలు పేరుకూడా ఇశ్రాయేలు నుండి తోలగించబడుతుంది (2:17).

ఇశ్రాయేలుతో తన వివాహ అభ్యర్థన శాశ్వత వివాహంగా ముగుస్తుందని దేవుడు స్పష్టంచేశాడు. తన ప్రజలు వారి దేశంలో నెమ్మదిగా నివసించునట్లు దేవుడు వారితో ఒక నిబంధన చేస్తాడు (2:18). అప్పుడు ఇశ్రాయేలును వివాహమాడతాడు. నీవు నిత్యము నాకుండునట్లుగా నిన్ను ప్రధానము చేసికొందును అని ఆయన అన్నాడు. ఆయన ఆశ్రయంలో ఇశ్రాయేలు “నీతి,” “న్యాయం,” “దయా,” “దాక్షిణ్యత” లను కలిగి దేవున్ని ఎరిగియుంటుంది (2:19, 20).

అంతేగాకుండా ఈ వివాహం ద్వారా ఇశ్రాయేలులో ఎంతో ఆశీర్వాదం కలుగుతుంది.

దేశం సమృద్ధియైన పంటను అందిస్తుంది (2:21, 22). ఇశ్రాయేలు దేశంలోస్థిరపడగా, దేవుడు వారి మీద జాలి చూపుతాడు. ఒకప్పుడు తిరస్కరించిన వారిని ఆయన ఇప్పుడు "నా జనము" అని చేర్చుకుంటాడు వారు "నీవే మా దేవుడవు" అని అంటారు (2:23)!

ఒక మంచి ప్రేమ కథ సుఖాంతం అయినట్లే ఇశ్రాయేలుతో దేవుని కథ కూడ సుఖాంతం అవుతుంది.

2వ అధ్యాయం నుండి ఇశ్రాయేలీయులకు ఏ సందేశం ఇయ్యబడింది? ఇది కూడా 1 మరియు 3 అధ్యాయాల వంటిదే: దేశం వ్యభిచారం చేసింది. అయినా దేవుడింకను ప్రేమించాడు తిరిగి తన యొద్దకు రావాలని ఆశించాడు, దాన్ని నెరవేర్చేందుకు వారిని శిక్షించి, వివాహ అభ్యర్థననూ చేశాడు, వారు తిరిగి వచ్చి తమ దేవునితో సంబంధాన్ని పునరుద్ధరించుకుంటే, దేవుడు వారిని సమృద్ధిగా ఆశీర్వదిస్తారు.

## ఈనాడు మనకు అన్వయించదగిన ప్రేమకథ

ఈ అసాధారణ ప్రేమ కథ మనకు ఏ సందేశాన్నిస్తుంది?

మొదటిగా, దేవుడు తన ప్రేమ, కృప ద్వారా అందిస్తున్న రక్షణను పొందుకునేందుకు మనం అర్హులము కాదని గుర్తుచేయబడుతున్నాము. ఉదాహరణకు, రోమీయులకు 5:8 ఇలా చెప్తుంది, "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు, ఎట్లనగా మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను," హోషేయ గ్రంథంలో, దేవుడు మొదట ఇశ్రాయేలుతో నిబంధన చేసిన సమయంలో అది వేశ్యగా చెప్పబడింది, అదేవిధంగా, మనం క్రైస్తవులమైనందుకు అందులో గొప్పలు చెప్పుకునేందుకు మన నీతి ఏదీలేదు (చూడండి ఎఫెసీయులకు 2:8, 9).

రెండవదిగా, రక్షించబడేందుకు మనకు అర్హత లేకున్నా, దానితో నిమిత్తం లేకుండా, దేవుడు మనలను రక్షించి "వివాహం" ద్వారా మనలను ఆయనతో జత చేసుకున్నాడు, దేవునితో క్రైస్తవుని సంబంధం వివాహ బంధంతో క్రొత్త నిబంధనలో అనేకమార్లు పోల్చబడింది (చూడండి రోమీయులకు 7:3, 4; ఎఫెసీయులకు 5:23-25).

మూడవదిగా, క్రీస్తుతో మనం "ప్రధానం" చేయబడిన వారము కాబట్టి "మరణం వరకు నమ్మకస్థులుగా ఉండాల్సిన" భాధ్యత మనపై ఉంది (ప్రకటన 2:10).

నాల్గవదిగా, ఇశ్రాయేలు వలెనే మనం కూడా చెదిరిపోతుంటాము. దేవుని కంటే ముందు ఇతర వాటిని ప్రాధాన్యంగా ఎంచితే మనం విగ్రహారాధికులం, ఆత్మీయ వ్యభిచారులమవుతాము, మనం గొమెరు వలె ఉంటాము, మనం ఎప్పుడైతే ఆత్మీయ వ్యభిచారం జరిగించుటలేదని, సరిగా నిలువబడి యున్నామని అనుకుంటామో అప్పుడే పతనమవుతాము (1 కొరింథీయులకు 10:12).

ఐదవదిగా, దేవుని ప్రజలు ఆయనన్నుండి వెనుదిరిగితే ఏం జరుగుతుందో మనం నేర్చుకున్నాము. మన గూర్చి ఆయన తన చేతులను కడిగి వేసుకొంటాడా? లేదు, మనం తిరిగి రావాలని ఆయన కోరుకుంటాడు. మన పాపాలు ఆయన హృదయాన్ని భగ్నం చేస్తాయి కానీ మన పాపాలను బట్టి ఆయన మనల్ను వదిలి వేయడు, మనల్ను తిరిగి తెచ్చుకునేందుకు ఆయన ఎంతో దూరం వెళ్ళతాడు. మనం క్రైస్తవులమైనప్పుడే గాకుండా, క్రైస్తవులముగా మనం చేసే ప్రతి పాపాన్ని (1 యోహాను 1:7) క్షమించేందుకు (యోహాను 3:16) ఆయన

తన అద్వితీయ కుమారున్ని మన నిమిత్తం అర్పించేంత దూరం వెళ్ళాడు. అన్యులు, అలాగే తప్పులు చేసే దేవుని పిల్లలు కూడా ఇదే క్రీస్తు రక్తం ద్వారా రక్షింపబడుతున్నారు. గోమెరును వెనక్కు తెచ్చుకునేందుకు హోషేయ వెల చెల్లించాడు మరి మనలను వెనక్కు తెచ్చుకునేందుకు దేవుడు ఏం వెల చెల్లించాడు? తన ఏకైక కుమారుని మరణం. దేవుని ప్రేమ ఎంత గొప్పది!

## ముగింపు

"దేవునితో నా సంబంధంలో నేనెక్కడ ఉన్నాను? నేను ఆయన నుండి వైదొలగిపోయానా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. గోమెరు లాగే, మనం పాపంలో, బానిసత్వంలోనే ఉన్నామా? ఎక్కువ వెల ఇచ్చుదానికి మనలను మనం అమ్ముకుని బానిసలుగా ఉన్నామా? అయితే మంచి శుభవార్త ఏమిటంటే, మనమలా ఉన్నాగాని, మనం తిరిగి రావాలని దేవుడు కోరుతున్నాడు. తప్పిపోయిన కుమారుడుని తండ్రి స్వాగతించినట్లే, మనలను కూడా దేవుడు స్వాగతిస్తున్నాడు (లూకా 15:20–24). అంతే గాకుండా మనలను తిరిగి తెచ్చుకునేందకు దేవుడు వెల కూడా చెల్లించాడు. తన కుమారుని యిచ్చేశాడు. ఇప్పుడు మనం చేయాల్సిందల్లా ఒక్కటే – ఆ వెలను అంగీకరించడం! యేసుని యందు విశ్వాసముంచి (యోహాను 8:24), మన పాపములను ఒప్పుకుని (లూకా 13:3) క్రీస్తునందలి మన విశ్వాసాన్ని ఒప్పుకుని (మత్తయి 10:32) పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం ద్వారా, ఆయనతో కూడ పాతి పెట్టబడడం (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38) ద్వారా మనం దీనిని చేయగలం. తప్పు చేసిన దేవుని పిల్లలు దాని విషయమై పశ్చాత్తాపపడి (అపొస్తలుల కార్యములు 8:22). దాన్ని ఒప్పుకుని (1 యోహాను 1:9). దేవుడుని క్షమాపణ కోరుకుంటే (యాకోబు 5:16). ఆయన దగ్గరకు తిరిగి వెళ్ళగలరు. ఎవరైనా యథార్థ హృదయంతో వీటిని చేసి ఆయన యొద్దకు వస్తే ఆయన పాపులను ప్రేమిస్తాడు కాబట్టి వారిని దేవుడు స్వాగతిస్తాడు. ఎవరైనా దేవునినుండి వైదొలగితే ఆయన హృదయం వేదన చెందుతుంది. వారు తిరిగి రావాలని ఆయన ఆశిస్తాడు.